# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక




May 1994

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "స త్య వా ణి" అను రేడియో కార్యక్రమములద్వారా, మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకము మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/-** లు ఈ క్రింది అడ్రసుకు **M.O.** చేసినచో రూ. **100-00** లకు మించిన విలువగల **15** నుండి **20** రకముల పుస్తకములు, మరియు రెండు సంవత్సరముల వరకు "సత్యవాక్కు" అను మాసపత్రిక మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి.

మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయము తెరవండి.

మావద్ద లభించు పుస్తకముల రేట్ల వివరములు పోస్టేజీతో సహా

| | | |
|---|---|---|
| 1. | పెద్ద బైబిలు | రూ. 45-00 |
| 2. | పెద్ద అచ్చు బైబిలు | 110-00 |
| 3. | రిఫరెన్సు బైబిలు | 75-00 |
| 4. | 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు రెండు సంవత్సరముల పాటు సత్యవాక్కు మాస పత్రిక ఉచితం. | రూ. 25-00 |

గమనిక : మీరు పంపు పైకము M.O. ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ రాయండి.

**SATYA VANI**
Sambamurthi St., Ramaraopeta,
KAKINADA - 533 004.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor :
J.C. CHOATE

Managing Editor :
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 14    మే 1994    సంచిక 10

## సంపాదకీయము

### సంఘమును ఎప్పుడు కించపరచవద్దు

### (Don't Ever Make Fun of the Church)

సంఘమును ఒక మానవ కల్పిత సంస్థగా, ప్రాధాన్యత లేని సంస్థగా చూచేవారు 'క్రైస్తవలోకంలో' నేడు అనేకులున్నారు. పరలోకానికి వెళ్లాలంటే దానిలో సభ్యులవనక్కర లేదని వారు చెబుతారు. నేడు అనేక మతశాఖల సంఘాలున్నాయి గనుక అన్ని సంఘాలు మంచివేయని వారు చెబుతారు. ఈ మతశాఖలను సమర్థించుటకుగాను, వారు అవన్నీ కలసి బైబిలులో మనకు కనబడే సంఘమవుతా యుంటారు. మరికొందరు యోహాను సువార్త 15వ అధ్యాయములోనికి వెళ్లి క్రీస్తు ద్రాక్షవల్లియని వివిధ మతశాఖలన్నీ తీగెలని చెబుతారు.

అయితే విచారింపదగిన సంగతి యేమంటే కొందరు క్రీస్తు సంఘాన్ని కించపరుస్తారు, దాన్ని గూర్చి వేళాకోళం ఆడతారు, దానికేమీ ప్రాముఖ్యత లేనట్లు ప్రవర్తిస్తారు. ఒకే ఒక్క సంఘమున్నదని, అది రక్షింపబడిన వారితో సమకూడినదని, పరలోకమునకు వెళ్లాలంటే ఒకడు దానిలో సభ్యుడై యుండాలని బోధించు వారిలో తప్పు పట్టుకొనుటకు చూచు ప్రయత్నిస్తారు.

వివిధ మానవులచే స్థాపించబడిన వందలాది సంఘాలు నేడున్నాయి. వాటిలో చాల సంఘాలు 200 సంవత్సరముల క్రితము ఆరంభింపబడినట్టివి. ఈ సంఘాలు కొన్ని వాటి సంస్థాపకుల పేరును ధరిస్తాయి, మరికొన్ని వారి ఆరాధన దినముయొక్క పేరును పెట్టుకొంటాయి. లేదా వారి విశ్వాసాచరణ పద్ధతి ప్రకారము అవి పిలువబడతాయి. వాటిలో సభ్యులగుటకు వివిధ షరతులుంటాయి, వారి ఆరాధన పలువిధాలుగా ఉంటాది; వారి కిష్టమొచ్చిన రీతిగా వారి బోధ ఉంటాది. ఆశ్చర్యమేమంటే యిదంతయు క్రీస్తు నామమున చేయుచున్నామని వారు చెబుతారు. ఒకరి కొకరు పొసగని ఈ సిద్ధాంతాచరణ పద్ధతులను క్రీస్తు అంగీకరిస్తాడని వారనుకొంటారు.

క్రైస్తవలోకము ఈ విధంగా గజిబిజి అయిపోయి విభాగింపబడి యుండుట ఎంత విచారము! యిదంతయు ఆయన మార్గాన్ని హేళన చేయడం, ఆయన బోధను, త్యాగాన్ని కించపరచడంగాక మరేమవుతాది? అయితే దేవుని మాటలకు కొంతకలపడమో, తీసివేయడమో, చేసిన వీరంతా నాశనమవుతారని గ్రహించే సరికి యిందులో నవ్వతగినది యేదీలేదు (ప్రక 22 : 18, 19). వారూనాశనమవుటయేగాక, వారి అబద్ధబోధలవలన మోసగించబడిన వారందరు నాశన మవుతారు (మత్తయి 7 : 21-23).

క్రీస్తు సంఘమును ఎన్నడు దయచేసి హేళన చేయవద్దు.

సంఘాన్ని కించపరచవద్దు. అది ప్రాముఖ్యము కాదని చెప్పవద్దు. బైబిలును చదువుము, దానిని ధ్యానించుము. సంఘమును గూర్చి తెలిసికొనుము. సంఘము రక్షకుడు కాదు, నిజమే; గాని క్రీస్తు దాని రక్షకుడు. రక్షింపబడిన వారందరినీ ఆయనే దానితో చేర్చుకొంటాడు (ఎఫెసీ 5 : 23). సంఘాన్ని రక్షించేవాడు క్రీస్తు. అయితే రక్షింపబడాలంటే, పరలోకానికి వెళ్లాలంటే మనము సంఘములో యుండాలి. నిజానికి నేను క్రీస్తు యొక్క ఏకైక సంఘాన్ని గూర్చి మాట్లాడుచున్నాను. బైబిలులో మనకు కనబడేది అదొక్కటే.

సంఘము ప్రాముఖ్యము కాదని చెప్పువానికి ఎంత ధైర్యము! ఎంత బుద్ధిహీనత! క్రీస్తు సంఘమును స్థాపించాడు (మత్తయి 16:18). ప్రాముఖ్యత లేనిదానిని, అనవసరమైన దానిని ఆయన స్థాపించాడా? సంఘముకొరకు క్రీస్తు సిలువలో చనిపోయాడు (ఎఫెసీ 5 : 25). సంఘమును సంపాదించుటకొరకు ఆయన తన రక్తాన్ని చిందించాడు (అపో. కా. 20 : 28). ఆయన మరణం వ్యర్థమా? అనవసరంగా ఆయన తన రక్తాన్ని చిందించాడా? మిత్రులారా, ఆలోచించండి, బైబిలులో మనకు కనబడు సంఘము యొక్క శిరస్సు ఎవరో, అది ఎవరి పేరు ధరించాలో, అసలు క్రీస్తు ఎన్ని సంఘములను స్థాపించాడో తెలిసికొనండి (కొలస్స 1 : 18; రోమా 16 : 16; ఎఫెసీ 4 : 4-6). ఈ సంగతులను గూర్చి నీవాలోచిస్తే సంఘము మానవ కల్పిత సంస్థ కాదని, అతి ప్రాముఖ్యమైనదనీ, పరలోకానికి వెళ్లడానికి దానిలో సభ్యులై యుండుట అత్యవసరమని నీవు గమనించగలవు.

మనము ప్రభువును, ఆయన మార్గమును, బోధను, సంఘాన్ని, నామాన్ని ప్రేమించాలి మరియు మన ఆత్మల రక్షణార్థము లేఖనములు బోధించే ప్రతిదానిని మనము గౌరవించాలి. మన రక్షణ,

ఆరాధన, క్రైస్తవ జీవనము, నిత్యజీవ వాగ్దానములు మొదలగు వాటిని మనం తెలిసికోవాలి; గౌరవించాలి. యివన్నీ తీవ్రమైన సంగతులే. ప్రభువు సంఘాన్ని, ఆయన బోధను కించపరచువారు ఒకానొక దినమందు కించపరచబడుదురు. అక్కడ హేళన కాదుగాని, ఏడ్పును పండ్లు కొరుకుటయును ఉండును.

—o—

కొండమీద ప్రసంగము - 3

## సాత్వికులు ధన్యులు

## (Blessed are the Meek)

(మత్త 5 : 5)

సాత్వికులు ధన్యులు వారు భూలోకమును స్వతంత్రించుకొందురని కొండమీద చేసిన ప్రసంగములో యేసుప్రభువు చెప్పారు. సాత్వికము అంటే వినయముకాదు (**Meekness does not mean humility**). సాత్వికము ఒక మానవుడు తోటి మానవుని యెడల తన క్రియ ప్రక్రియలలో ప్రదర్శించే తత్వము, ఉపాధ్యాయుడు బోధించుచుండగా విద్యార్థి ప్రదర్శించే మనస్తత్వము, తండ్రి తన కుమారుని హెచ్చరించేటప్పుడు కుమారుని తత్వము, యజమానుడు సేవకునికి ఆజ్ఞల నిచ్చునప్పుడు సేవకుడు ప్రదర్శించే తత్వము. అందువలన సాత్వికత యనునది మానవుడు తోటి మానవుని యెడల మాత్రమే గాక దేవుని యెడల కూడ కనుబరచే మనస్తత్వము. నేను సాత్వికుడను, దీనమనస్సుగలవాడను అని యేసుప్రభువు చెప్పినప్పుడును (మత్తయి 11:28), "రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" యని యాకోబు చెప్పినప్పుడును (యాకో 1 : 21) మానవుడు దేవునియెడల ప్రదర్శించవలసిన తత్వాన్ని గూర్చి చెప్పబడింది. యిది మానవుని బాహ్యప్రవర్తనను గూర్చిగాక అతని సహజ

తత్వమునుగూర్చి చెప్పబడినది. దేవుని మార్గముల నెదురాడకుండ, ఆయన మార్గము లన్నియు శ్రేష్టమైనవని అంగీకరించు తత్వము సాత్వీకము. ఏలయనగా దీనమనస్సు గలవాడే సాత్వీకుడు. అతడు ఎదురాడడు. దేవునితో పెనుగులాడడు.

దేవుని యెడల సాత్వీకము కలిగియుండుట మాత్రమే గాక తోటిమానవుని యెడలకూడ ఒకడు సాత్వీకము కలిగియుండాలి. ఇంకో మాటలో దేవుని విషయంలో సాత్వీకుడైనవాడు సహజంగా సాటి మానవుని యెడల కూడ సాత్వీకుడై యుంటాడు. సాత్వీకమునకు దగ్గరగా యున్న మాటలు ఓర్పు, సహనము, సాధువు, మృదువు మొదలైనవి. యిది గర్వము, అహంభావము, అహంకారానికి వ్యతిరేకమైనది.

బైబిలులో సాత్వీకాన్ని ప్రదర్శించిన కొందరిని గూర్చి మనం ఆలోచించవచ్చును. మోషే, దావీదులు పాతనిబంధనలోను, అపొస్తలులు, యేసుప్రభువు క్రొత్తనిబంధనలోను మనకు ప్రాముఖ్యముగా కనబడ్తారు. నేను సాత్వీకుడను అని ప్రభువు తనను గూర్చి తాను చెప్పచున్నారు. యిట్టి సాత్వీకత ఒక గొప్ప ధన్యత.

"మోషే భూమిమీదనున్న వారందరిలో మిక్కిలి సాత్వీకుడు". అని యెహోవా దేవుడు సాక్ష్యమిచ్చెను (సంఖ్యా 12.3). అయినను పాతనిబంధన చరిత్ర అంతటిలో మోషే కంటె మిన్నయైన వాడింకొకడు లేడు. అతడు ఐగుప్తీయుల రాజు సముఖమునకు దేవుని ప్రతినిధిగా వెళ్ళాడు. ఆరు లక్షలకంటే పైగా యున్న ఇశ్రాయేలు జనాంగానికి నాయకత్వం వహించి అరణ్యముగుండా వారిని నడిపించాడు. వారిని బానిసత్వమునుండి విడిపించాడు. పాపనిబంధనలోని మొదటి ఐదు పుస్తకాలను పరిశుద్ధాత్మ ప్రేరేపణ వలన లిఖించాడు. అతడు

మహా ధైర్యశాలి, గొప్ప నాయకుడు, అయినను భూమిమీద నున్న వారందరిలో మోషే సాత్వికుడు. అందుకే సాత్వికులు ధన్యులు, వారు భూలోకమును స్వతంత్రించుకొందురని యేసుప్రభువు చెప్పారు. మోషేను మాదిరిగా మనము తీసికొంటే సాత్వికులు బలహీనులు కారు, సాత్వికత బలహీనత కాదు అని గ్రహించగలము. **(Meekness is not Weakness).**

మోషే ఇంత గొప్పవాడైనను ఒకే ఒక సందర్భములో తన సాత్వికాన్ని కోల్పోయాడు. సంఖ్యాకాండము 20వ అధ్యాయములో ఇశ్రాయేలీయులు కాదేషులో దిగిరి. అక్కడ వారికి నీళ్ళు లేకపోగా వారు మోషే అహరోనుల మీద సణగిరి. అంతట యెహోవా మోషేతో అక్కడ నున్న బండతో మాట్లాడుము, అది నీళ్లిచ్చునని సెలవిచ్చెను. గాని మోషే తన సాత్వికాన్ని కోల్పోయి ఆ బండను తన కర్రతో రెండు మారులు కొట్టెను. మోషే చేసిన ఈ పొరపాటును బట్టి అతడు వాగ్దానము చేయబడిన కానానులో ప్రవేశించలేక పోయెను (సంఖ్యా 20:1-13).

సాత్వికాన్ని గూర్చి దావీదు ఎంతో వ్రాసాడు. పాతనిబంధన లేఖకు లందరికంటె దావీదు సాత్వికాన్ని గూర్చి ఎక్కువ చెప్పాడు. యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగములోని మాటలు చాల మట్టుకు దావీదు వ్రాసిన మాటలవలె అగుపడ్తాయి. "దీనులు భూమిని స్వతంత్రించుకొందురు. బహు క్షేమము కలిగి సుఖించెదరు" అని కీర్తన 37:11లో అతడు వ్రాసాడు. ఇశ్రాయేలీయులను పరిపాలించిన మహారాజు దావీదు. అతడు వారిని 40 సంవత్సరములపాటు పాలించాడు. అతని సంతతివారు యించుమించు ఒక వెయ్యి సంవత్సరములు రాజరికము చేసారు. యేసుప్రభువు కూడ దావీదు వంశావళిలోనివాడే (మత్తయి 1:1). దావీదు అంత ఘనత వహించిన స్థితిలో యున్నను

సాత్వికమును గూర్చిన తన తలంపులను మనకు తెలియజేసి యున్నాడు.

"దీనులు భోజనముచేసి తృప్తి పొందెదరు. యెహోవాను వెదుకు వారు ఆయనను స్తుతించెదరు" అని కీర్తన 22 : 26లో అతడు వ్రాసాడు. "న్యాయవిధులను బట్టి ఆయన దీనులను నడిపించును, తన మార్గమును దీనులకు నేర్పును" అని కీర్తన 25 : 9 లో అతడు పలికాడు. "యెహోవా దీనులను లేవనెత్తువాడు, భక్తిహీనులను ఆయన నేలను కూల్చును" అని కీర్తన 147:6 లో వ్రాసాడు, "యెహోవా తన ప్రజలందు ప్రీతి గలవాడు. ఆయన దీనులను రక్షణతో అలంకరించును" అని 149:4లో వ్రాశాడు.

యేసు ప్రభువు సాత్వికులలో గొప్ప వాడు. ఆయన అందరినీ పిలుచుచున్నాడు. ఆయన యిచ్చు ఆహ్వానము గొప్పది. "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా నాయొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను, దీన మనస్సు గలవాడను గనుక మీ మీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నాభారము తేలికగాను ఉన్నవి" (మత్తయి 11:28-30). నేను సాత్వికుడనని ప్రభువు చెప్పుకొనినను ఆయన బలహీనుడు కాదు. ఆయనను గొర్రెపిల్లగాను, సింహముగాను యోహాను వర్ణించాడు (ప్రకటన 5:5, 6). యేసు ప్రభువులో సాత్వికము, ధైర్యము, సాహసము దీనత్వము పరిపూర్ణముగ మిళితమై యున్నవి. తండ్రియైన దేవుని చిత్తాన్ని నెరవేర్చుటలో ఆయన ఈ శ్రేష్ఠ లక్షణములను పరిపూర్ణముగ ప్రదర్శించాడు.

సాత్వికము ఆత్మ ఫలములలో ఒకటైయున్నది (గలతీ 5:23).

మనము దేవుని విషయములోను మానవుల విషయములోను సాత్వికము కలిగి యుండవలెను. "ప్రభువు దృష్టికి మిమ్మును మీరు తగ్గించుకొనుడి, అప్పుడాయన మిమ్మును హెచ్చించును" (యాకోబు 4 : 10). "దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింద దీనమనస్కులై యుండుడి" (1 పేతురు 5 : 6). "మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి" యని యాకోబు చెప్పుచున్నాడు (యాకో 1 : 21). "నిర్మలమైన మనస్సాక్షి గలవారై మీలో ఉన్న నిరీక్షణను గూర్చి హేతువడుగు ప్రతివానికిని సాత్వికముతోను భయముతోను సమాధానము చెప్పుటకు ఎల్లప్పుడు సిద్ధముగా ఉండుడి" యని పేతురు చెప్పాడు (1 పేతురు 3 : 15).

పాపములో పడిన క్రైస్తవుని మరల మంచిదారికి తీసికొని వచ్చునప్పుడు ఆపనిని మనము సాత్వికముతో చేయవలెను. "సహోదరులారా, ఒకడు ఏ తప్పిదములోనైనను చిక్కుకొనిన యెడల ఆత్మసంబంధులైన మీలో ప్రతివాడు తానును శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు సాత్వికమైన మనస్సుతో అట్టివానిని మంచిదారికి తీసుకొని రావలెను" (గలతీ 6 : 1). స్త్రీలు సాధువైనట్టియు మృదువైనట్టియు అక్షయాలంకారముగల స్వభావము గలవారై యుండవలెను (1 పేతు 3 : 4).

మోషే, దావీదు, యేసుక్రీస్తులను మాదిరగ మనం గమనించియున్నాము. వీరు సాత్వికులే అయినను ధైర్యము, సాహసము గలవారు. గనుక సాత్వికము సాహసము ఎల్లప్పుడు కలిసే ఉంటాయి. సాత్వికులు ధన్యులు వారు భూలోకమును స్వతంత్రించుకొందురని యేసుప్రభువు చెప్పారు. ఈ లోకంలో భూమి యొక్క దస్తావేజులు ఎవరి పేరున ఉన్నను, ఈ భూమియు దానిమీద నున్న సమస్తమును

యెహోవా దేవునిచే. ఆయన మన తండ్రి. సాత్వికులు ఆయన పిల్లలై యున్నారు. వారు ఆయన స్వాస్థ్యమునకు వారసులు. వారు భూలోకమును స్వతంత్రించు కొందురు. సాత్వికుడైన యేసు ప్రభువును నీవు వెంబడించాలని ఆయన కోరుచున్నాడు. నిన్ను పిలుచుచున్నాడు. ఆయనకు నీవు లోబడితే నిత్యజీవితాన్ని స్వతంత్రించు కొనగలవు.

— జాషువా గూటం.

— o —

## శపింపబడిన అంజూరపు చెట్టు

యేసు యెరూషలేమునకు వచ్చి దేవాలయములో ప్రవేశించి, చుట్టు సమస్తమును చూచి, సాయంకాలము అయినందున పండ్రెండు మందితో కూడ బేతనియకు వెళ్లెను. మరునాడు వారు బేతనియనుండి వెళ్లుచుండగా ఆయన ఆకలి గొని, ఆకులు గల అంజూరపు చెట్టును దూరమునుండి చూచి దానిమీద ఏమైనను దొరుకునేమో అని వచ్చెను. దాని యొద్దకు వచ్చి చూడగా, ఆకులు తప్ప మరేమియు కనబడలేదు; ఏలయనగా అది అంజూరపు పండ్ల కాలము కాదు. అందు కాయన ఇక మీదట ఎన్నటికిని నీ పండ్లు ఎవరును తిన కుందురుగాక అని చెప్పెను (మత్తయి 12 : 18-22, మార్కు 11:11-28). సాయంకాలమున ఆ చెట్టు ఎండిపోవుట చూచి పేతురు బోధకుడా, నీవు శపించిన అంజూరపు చెట్టు ఎండిపోయెనని చెప్పెను.

ప్రభువు కరుణామయుడు, ప్రేమామయుడు, కృపాకనికరము గలవాడు. సిలువమరణము పొందినపుడు హింసించుచున్న వారిని చూచి, తండ్రీ, వీ రేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక క్షమించుమని చెప్పిన ప్రభువు, ఏమీ తెలియని మాటలులేని అంజూరపు చెట్టును శపించుట న్యాయమా అని మనకు తోచును.

ఎందుకు ఈ అంజూరపు చెట్టు శపింపబడెను ? క్రీస్తు తన

శక్తిని, గొప్పతనాన్ని చాటుకొనుటకు కాదుగాని, తన శిష్యులకు, ఆనాటి సమాజములోని వాస్తవాన్ని బోధించుట కది చేసెను.

పాలస్తీనా దేశము ధాన్య, ద్రాక్షారస, నూనెలకు, అంజూరపు చెట్లులకు ప్రసిద్ధి (ద్వితి 8 : 8, 28 : 24-25). మన దేశములో వేప, గానుగ, గంగిరేని చెట్లు ఇంటిముందు నుండును. అలాగే యూదులకు ప్రతి ఇంటిముందు అంజూరపు చెట్లుండును (1 రాజు 4 : 25, మీకా 4 : 4, జెకర్యా 3 : 10, యోహాను 1 : 48).

పంట కాలము కానపుడు, అంజూరపు చెట్టుకు ఆకులుండవు. ఆకులున్నా తప్పక కాయలుండవలెను. అది అంజూరపు చెట్టు యొక్క నైజము. క్రీస్తు ఆకులున్న అంజూరపు చెట్టును చూచి, తప్పక కాయలుండునని ఆశించి చెట్టు దగ్గరకు రాగా, ఒక కాయ కూడ దొరకలేదు. అది ఆకులతో నిండి, చూపరులకు పండ్లు యున్నట్లుగా భ్రమ కలిగించెను. "దీనినే వేషధారణ" అందురు. అంజూరపు చెట్టు పండ్లు లేకపోయినా, పండ్లున్నట్లు ఆశ కలిగించి మోసం చేస్తుంది. అందుకనే కాబోలు ప్రభువు - ఇకమీదట ఎన్నటికిని నీపండ్లు ఎవరు తినకుందురని చెప్పెను.

## వేషధారులైన యూదులు

వేషధారణ అంటే క్రీస్తు ప్రభువుకు ఎంత అసహ్యమో దీనిని బట్టి అర్థము అగుచున్నది. అంజూరపు చెట్టువలె, తమలో లేనిది, ఉన్నట్టుగా నటించేవారిని ఆయన అసహ్యహించుకొనెను. క్రియలు లేకుండా మాటలు చెప్పుట వ్యర్థం: వ్యర్థుడా "క్రియలులేని విశ్వాసము మృతము" (యాకోబు 2 : 26). క్రీస్తు ప్రభువు అంజూరపు చెట్టును యూదా జాతికి పోల్చి మాట్లాడెను. యూదులు పైకి భక్తి కలిగియున్నట్లు నటించుచుండిరి. ఆత్మ ఫలమైన ప్రేమ, సమాధానము, నీతి, కనికరము, దయాళుత్వము, ఆశానిగ్రహము,

దీర్ఘ శాంతము యివి యూదులలో యుండాలని క్రీస్తు ఎదురు చూచెను. గాని వారిలో వేషధారణ, కలహము, మత్సరము, క్రోధము, అసూయ గలవు. వీరికి ముందు జరుగబోవు శిక్షను తన శిష్యులకు ఉపమాన రీతిగా ఆయన బోధించెను.

ప్రభువు బోధించిన ఈ శిక్ష యూదులకు క్రీ॥శ॥ 70లో టైటస్ సైన్యాధిపతి యెరూషలేమును నేలమట్టముచేసి విధించెను. క్రీస్తు ప్రభువు ఈ విషయాన్ని ముందుగానే చెప్పెను (మార్కు 13:1-2).

యేసు పునరుత్థానుడైన తరువాత ఇంచుమించు 40 సంవత్సరములకు యెరూషలేము, దేవాలయము నాశనమాయెను. నేటివరకు అది కట్టబడలేదు. 1900 సం॥ల క్రితము ప్రభువుచే శపింపబడిన అంజూరపు చెట్టువలె యూదులు ప్రపంచమంతా చెదరిపోయిరి.

దేవుని కిష్టుడుగా లేనిచో వేషధారణ జీవితము సాగించువారికి అంజూరపు చెట్టునకు పట్టిన గతి పట్టును. వేషధారణచేత కొంత కాలము కొంతమందిని మోసం చేయవచ్చును. మన జీవితములను, మన హృదయ రహస్యములను ఎరిగిన దేవునికి, మన జీవితములను మరుగు చేయలేము. ఆయన వానివాని క్రియలు చొప్పున ఫలితము నిచ్చువాడు (II కొరింథి 5:10).

మనం ఆకులు కల్గి ఫలములున్నట్లు భ్రమింపచేయు అంజూరపు చెట్టువలె యున్నామా? లేక మంచి ఫలములు ఫలించు అంజూరపు చెట్టువలె యున్నామా? —**D.** యోనా, **K.G.F.** కర్నాటక.

— o —

## కావలెను

## ( WANTED ! )

మనము ప్రతి నిత్యమూ పత్రికలలోను, రేడియో, టి.వి.లోను అర్హతగలిగిన అభ్యర్థులు ఆయా ఉద్యోగములకు కావలెనని వింటూ

ఉంటాము. కుటుంబ వ్యవస్థ దేశానికి వెన్నెముకలాంటిది. ఈ లోకములో మొట్టమొదట ఈ కుటుంబ వ్యవస్థాపకుడు దేవుడే. ఆదిదంపతులైన ఆదాము హవ్వలను ఆశీర్వదించి ఆయన మొదటి వివాహకర్తగా వ్యవహరించెను (ఆది 1 : 28, ఆది 2 : 21-25). కనుక కుటుంబము పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించి ఆయన నియమనిబంధనలకు అనువైన జీవితవిధానము కలిగినవారు కావలెనని దేవుని నిర్ణయం. కుటుంబములోని తండ్రి, తల్లి, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు, బిడ్డలు ఎట్టివారై యుండవలెనో పైవ లేఖనము ద్వారా తెలుసుకొందము.

**1. అబ్రాహాములాంటి తండ్రులు కావలెను :-** అబ్రాహాము బాబిలోనియాలోని "ఊరు" పట్టణ నివాసి. బాబిలోనియా వారు అనేకమంది దేవుండ్లను దేవతలను పూజించెడివారు. వీరు నీరు, నిప్పు, సూర్యచంద్ర నక్షత్రములను ప్రకృతి శక్తులను పూజించెడివారు. ఊరు పట్టణస్థులు "షామాస్" అనే సూర్యదేవుని; సీను అనే చంద్రదేవుని ఆరాధించెడివారు. సీను అనే చంద్రదేవుని భార్య పేరు నిన్‌గళ్. నీనా అనేది ఆమెకు మరియొక పేరు. ఈ పేరుమీదుగా ఆ పట్టణమునకు నీనెవె అని పేరుపెట్టిరి. ఇట్టి వాతావరణములో విగ్రహారాధికులైన కుటుంబములో తెరహునకు అబ్రాహాము జన్మించెను (యెహోషువ 24:2). "ఎట్లనగా యెహోవా అబ్రాహామునుగూర్చి చెప్పినది అతనికి కలుగజేయునట్లు తన తరువాత తన పిల్లలను, తన యింటివారును నీతి న్యాయములు జరిగించుచు, యెహోవా మార్గమును గైకొనుటకు అతడు వారి కాజ్ఞాపించునట్లు నేనతని నెరిగియున్నానని నెను" (ఆది 18:19). అబ్రాహాము సంతానర్గ లేకపోవుటను బట్టి నిరాశ చెందినను, దేవునిపట్ల పరిపూర్ణ విశ్వాసము కలిగి వృద్ధాప్యములో కుమారుని కని, తన యేక కుమారుని దేవుని కర్పింప వెనుదీయకుండెను (ఆది 15:1-3, హెబ్రీ 11:17-19; ఆది 12:1-6). శారా అబ్రాహాము

యొక్క భౌతిక, ఆత్మీయ పరిస్థితులలో సహకరించి ఇస్సాకును దైవ భీతిలో పెంచుటలో అబ్రహామునకు సహకరించినది. మగని మనోభావము గమనించి దైవాజ్ఞానుసారముగా ప్రవర్తించిన మంచి ఇల్లాలుగా శారాను గూర్చి చెప్పవచ్చును (1 పేతు 3:6).

**2. హన్నా లాంటి తల్లులు కావలెను :-** తల్లి ఒడే బిడ్డకు బడి అన్నారు పెద్దలు. అడ్డాల నాటినుంచి మంచిశిక్షణ యిస్తే గడ్డాల నాటికి చక్కటి ప్రయోజకులు కాగలరు. ఎల్కాన భార్యయైన హన్నా సంతానము లేక బహుదుఃఖాక్రాంతురాలై వచ్చి యెహోవా సన్నిధిని ప్రార్థన చేయుచు బహుగా ఏడ్చుచు సైన్యముల కధిపతియగు యెహోవా నీ సేవకురాలనైన నాకు కలిగియున్న శ్రమను చూచి నీ సేవకురాలనైన నన్ను మరువక జ్ఞాపకము చేసికొని, నీ సేవకురాలనైన నాకు మగపిల్లను దయచేసిన యెడల వాని తలమీదికి క్షౌరపు కత్తి యెన్నటికి రానియ్యక వాడు బ్రతుకు దినములన్నిటను నేను వానిని యెహోవానగు నీకు అప్పగింతునని మ్రొక్కుబడి చేసికొనెను. తాను మ్రొక్కిన రీతిగా ఆమెకు కుమారుడు కలిగెను. ఆ కుమారుని దేవునికి ప్రతిష్టించి ఉగ్గుపాలతోనే భక్తి విశ్వాసములు నేర్పించెను. కనుకనే అతడు ఇశ్రాయేలీయులకు చివరి న్యాయాధిపతిగాను మొదటి ప్రవక్తగాను ఉండెను (1 సమూ 1:10-11, 19-20, 28; 1 సమూ 7:19-16). హన్నా యొక్క ప్రార్థన జీవితపు నీడ పసితనములోనే సమూయేలుపై పడినది. కనుకనే అతడు మరణము వరకు మంచి విశ్వాస జీవితమును జీవించెను. హన్నాలాంటి తల్లులు ఉంటే నేటి సంఘములో సమూయేలులాంటి కుమారులు తప్పక యుందురు. కనుక క్రీస్తు సంఘానికి హన్నాలాంటి తల్లులు కావలెను.

**3. క్రీస్తువంటి కుమారులు కావలెను :-** యేసుక్రీస్తు బాల్యమునుండి ఆయన తల్లిదండ్రులను గౌరవించి వారికి లోబడి

యుండెను. "అంతట ఆయన వారితో కూడ బయలుదేరి నజరేతునకు వచ్చి వారికి లోబడియుండెను. యేసు జ్ఞానమందును వయస్సునందును దేవునిదయ యందును మనుష్యుల దయయందును వర్ధిల్లుచుండెను" (లూకా 2:51-52). ఆయన కుటుంబ బాధ్యతలను నిర్వర్తించుటలో ఘన నీయుడు (యోహాను 19:25-27). భౌతిక సంబంధమైన తల్లిదండ్రులకు లోబడినట్లే పరలోకపు తండ్రికి లోబడెను. నేను నా తండ్రి పనుల మీద నుండవలెనని మీరెరుగరా ? అని మరియ యోసేపులతో చెప్పెను (లూకా 2:49). యేసు వారిని చూచి నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమై యున్నది అని శిష్యులతో చెప్పెను (యోహాను 4 : 34). దేవుని వాక్యము విని, దాని ప్రకారము జరిగించు వీరే నా తల్లియు నా సహోదరులునని వారితో చెప్పెను (లూకా 8 : 20-21, లూకా 11:27-28). క్రీస్తు పరలోకపు తండ్రిని ఆనందపరచిన కుమారుడు (మత్తయి 3:17). ఏతరము బిడ్డలకైనా యేసు ఆదర్శ ప్రాయుడు. మన లను రక్షించుటకు భువికేతెంచిన దైవ సుతుడు (ఎఫెసీ 6:1-4, కొలస్స 3:20-21, సామె 22:6).

**4. హనన్యా నెహెమ్యాలవంటి అన్నదమ్ములు కావలెను :—** క్రీ॥పూ॥ 586వ సం॥ నెబుకద్నెజరు పరిపాలనలో కాలి పోయి పడిపోయిన యెరూషలేము విషయములో నెహెమ్యా బహు దుఃఖము పొందెను (నెహెమ్యా 2:1-5). యెరూషలేముయొక్క ప్రాకారములు తిరిగి కట్టుటకు పూనుకొందము రండని ప్రజలను ప్రేరేపించుటకు నెహెమ్యా నాయకత్వము వహించెను (నెహెమ్యా 2:15-20). "ఈ ప్రకారముగా ఏబాలు మాసము యిరువది అయిదవ దినమందు, అనగా ఏబదిరెండు దినములకు ప్రాకారము కట్టుట సమాప్త మాయెను" (నెహెమ్యా 6:15-16). ఈ పనిలో అతని సహోదరుడైన

హానన్యా సహకరించెను (నెహెమ్యా 7:1-2). ఈనాటి సంఘములో నెహెమ్యా హనన్యాలవలె ఐక్యత కలిగి దేవుని పనిచేసినచో ఎంత మేలు ఎంత మనోహరము (కీర్తనలు 133:1-2).

**5. మరియ మార్తల వంటి అక్కాచెల్లెండ్రు కావలెను:-** మరియ మార్త అనే అక్క చెల్లెండ్రు కలసి క్రీస్తుకు పరిచర్య చేసిరి. యేసు తాను మృతులలో నుండి లేపిన లాజరు ఉన్న బేతనియకు వెళ్లెను. అక్కడ ఆయనకు విందు చేసిరి. మార్త ఉపచారము చేసెను. మరియ మిక్కిలి విలువగల అచ్చ జటామాంసి అత్తరు ఒక సేరున్నర ఎత్తు తీసుకొని యేసు పాదములకు పూసి తన తలవెంట్రుకలతో ఆయన పాదములు తుడిచెను (యోహాను 12 : 1-4, యోహాను 11:2-3, 5; లూకా 10 : 38). క్రీస్తుకు హృదయపూర్వకముగా సమర్పించుకొని పరిచర్య చేయుటకు మరియు మార్తలవలె నిశ్చయించుకొనినవారు ఉండుట క్రైస్తవ్యానికి ఎంతో ప్రోత్సాహకరము.

**6. దానియేలువంటి అధికారులు కావలెను :-** దానియేలు యెరూషలేమునుంచి బబులోనుకు కొనిపోబడిన వారిలో ఒకడు. రాజభోజనమును ద్రాక్షారసమును వద్దని తృణీకరించినవాడు (దాని 1:4, 8-16). దేవుడు జ్ఞానమును సకలశాస్త్ర ప్రవీణతయు వివేచనయు అనుగ్రహించెను. వారిలో దానియేలు సకల విధములగు దర్శనములను స్వప్న భావములను గ్రహించి తెలివికలవాడై యుండెను (దాని 1:17, దాని 5 : 12). దర్యావేషువల్ల ప్రధానిగా ఏర్పరచబడిన వ్యక్తి. దానియేలువంటి అధికారులు ఈనాటి సమాజానికి కావలెను. ప్రియ మిత్రమా నీవు అధికారివో అనధికారివో నీవు ఎవ్వరు అయినను నీవు చేయు పనిలో దానియేలువలె నమ్మకము, నీతి నిజాయితీయులు కల్గి జీవించుము (దాని. 6:5).

**7. పౌలువంటి ప్రసంగికుడు కావలెను :-** ప్రతి సువా

ర్తికుడు పోలువలె ఉండుట బహు మంచిది. క్రైస్తవుడు కాకపూర్వము సంఘమును హింసించుటయందు ఎంతటి ఆసక్తి పోలు కల్గియుండెనో క్రైస్తవుడైన పిదప క్రీస్తు సంఘముపట్ల అత్యాశక్తిని కల్గియుండెను. నేను క్రీస్తుతో కూడా సిలువ వేయబడి యున్నాను, ఇకను జీవించు వాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి నాకొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసమువలన జీవించుచున్నాను (గలతీ 1 : 20). అతడు అన్యజనుల కొరకు ఏర్పరచబడిన అపొస్తలుడు (గలతీ 1 : 13-15, గలతీ 2 : 7). సువార్త ప్రకటించవలసిన భారము నా మీద మోపబడియున్నది. అయ్యో, నేను సువార్తను ప్రకటింపక పోయినయెడల నాకు శ్రమ (1 కొరి. 9:16, 2 కొరి. 11:26-28, 2 కొరి. 12:9-10, ఫిలిప్పీ 4:13). ఇతడు ప్రభువు కొరకు తన్ను తానే సమర్పించుకొనెను. భక్తిని ఉపన్యాసకుడు. ఇల్లాంటి సమర్పణా జీవితంగల సువార్తికులు కావలెను.

అబ్రాహాములాంటి తండ్రివలె, హన్నా వంటి తల్లివలె, క్రీస్తు వంటి కుమారునివలె, నెహెమ్యా, షానన్యాలవంటి అన్నదములవలె, మార్త మరియ లాంటి అక్కచెల్లెండ్రవలె దేవుని కుటుంబములో కలసి జీవించుదము.

—పి. చంద్రశేఖర్, స్కూల్ ఆఫ్ ప్రీచింగ్, కాకినాడ-4.

—o—

## పరిశుద్ధాత్మ అనగా దేవుని ఆత్మ

**పరిచయము :-** పరిశుద్ధాత్మను గూర్చిన బోధ, ఆయన వ్యక్తిత్వము **(Personality)**, ఆయన పని, దేవునితోను, మానవునితోను, పరిశుద్ధాత్మ యొక్క సంబంధము దేవుని వాక్యము (బైబిలు) స్పష్టముగా బోధించుచున్నది.

బైబిలునందు మూడు యుగములు లేక శకములు కలవు. 1. పితరుల యుగము 2. మోషే యుగము 3. క్రీస్తు యుగము. దేవుడు మానవునితో వ్యవహరించుటకు అన్ని యుగముల యందును, ప్రతి సమయము నందును దేవుడు తన చిత్తమును, కార్యములను నెరవేర్చు కొనుటకును పరిశుద్ధాత్మను ఉపయోగించెను.

దేవుని నిత్యసంకల్పమును లోకమునకు బయలు పర్చుటకు పరిశుద్ధాత్మ ప్రవక్తల యందును, క్రీస్తునందును, అపొస్తలుల యందును నానా సమయములలో నానా విధములుగా పనిచేసెను. అంతే కాకుండ మార్పు చెందుచున్న పాపుల యందును ఆదిసంఘము నందును వ్యక్తిగత క్రైస్తవుని యందును దైవ ఉద్దేశమును సాధించుటకు పనిచేసెను. మరియు ముఖ్యముగా క్రైస్తవులు (దేవుని కుమారులు) దైవ కుమారుడైన క్రీస్తు స్వరూపము (వ్యక్తిత్వము) లోనికి మార్చబడునట్లు పరిశుద్ధాత్మ వారిలో (క్రైస్తవులలో) నివాసము చేయుట అనునది దేవుని ముఖ్య ఉద్దేశమై యున్నది. "మన మందరము ముసుగులేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మ చేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము" (2 కొరింథీ 3 : 18).

దేవుడు తన ముఖ్యోద్దేశము సాధించుటకు ఈ క్రైస్తవ శకము నందు పరిశుద్ధాత్మను విశ్రామము లేకుండ వాడుకొనుచుండెను.

పరిశుద్ధాత్మ దేవత్వమునందు ఒకవ్యక్తి అనగా దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్మ (వీరు) బైబిలు గ్రంథమందు గల లేఖనములు దేవత్వము అని పిలిచెను. "కాబట్టి మనము దేవుని సంతానమైయుండి మనుష్యుల చమత్కార కల్పనల వలన మల్చబడిన బంగారమునైనను, వెండి

నైననూ, రాతినైననూ దేవత్వము పోలియున్నదని తలంప కూడదు (అపొ. కా. 17 : 29).

ఆయన అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటబడుచున్నవి. గనుక వారు నిరుత్తరులై యున్నారు (రోమా 1 : 20). ఏలయనగా దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తు నందున్నది (కొలస్స 2:9). దేవత్వము అను పదము బైబిలునందు వాడినట్లు దైవ లేఖనములను చూచితిమి. ఇంగ్లీషు బైబిలునందు దేవత్వము అను పదమును **Godhead** (గాడ్ హెడ్) అని ఉపయోగింపబడెను. గ్రీకు బైబిలు గ్రంథము నందు **Theiotes** (థియోటెస్) అను పదము వాడబడెను. ఈ పదమును ఇంగ్లీషులో **Godhead** (గాడ్ హెడ్) అని అనువాదము చేయబడెను. శ్రీమంతుడగు దేవుని హితబోధకు వ్యతిరేకముగా మానవ కల్పిత సిద్ధాంతములు (బోధలు) బోధించరాదు (1 తిమోతి 1 : 10; రోమా 16 : 17; II తిమోతి 6 : 3; II తిమోతి 3 : 16).

## పరిశుద్ధాత్మ వ్యక్తిత్వమునకు ఋజువులు

పరిశుద్ధాత్మ వ్యక్తియని మనము ఎట్లు గుర్తించగలము ? ఉదా :- ఒకడు మాట్లాడుట, ఆలోచించుట, నడిపించుట, దుఃఖించుట, చెప్పుట మొదలగు పనులు చేయుట ద్వారా వ్యక్తి అని గుర్తించగలము. ఆలాగుననే పరిశుద్ధాత్మ ఒక వ్యక్తియని ఆయనను గూర్చిన లేఖనములను పరిశీలించెదము. పరిశుద్ధాత్మ దేవత్వము నందుగల ఒకవ్యక్తి ఈయన దైవ వ్యక్తి.

పరిశుద్ధాత్మ తండ్రియైన దేవునివలెను, ప్రభువైన క్రీస్తువలెను మాట్లాడెను. ఆయన పనులు ఆయన వ్యక్తిత్వమును బయలుపర్చు

చున్నవి. ఎట్లనగా "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణవలన మోసపర్చు ఆత్మల యందును, దయ్యముల బోధ యందును, లక్ష్యముంచి విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు" (1 తిమో 4 : 1).

"తండ్రి యొద్దనుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణ కర్త అనగా తండ్రి యొద్దనుండి బయలుదేరు సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినపుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును" (యోహాన్ 15 : 20). "నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతు లన్నియు జ్ఞాపకము చేయును" (యోహా 14 : 26). (1) ఆత్మ వచ్చినపుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును (2) సంభవింపబోవు సంగతులు తెలియజేయును (యోహా 16:12,15). ఆసియాలో వాక్యము చెప్పకూడదని పరిశుద్ధాత్మ వారి నాటంక పరచినందున వారు ఫ్రుగియ గలతియ ప్రదేశముల ద్వారా వెళ్ళిరి. ముసియ దగ్గరకు వచ్చి బితూనియకు వెళ్ళుటకు ప్రయత్నము చేసిరి గాని యేసు యొక్క ఆత్మ వారిని వెళ్ళనీయ లేదు (అపొ.కా. 16:6-7). మనకైతే దేవుడు తన ఆత్మ వలన వాటిని బయలుపర్చి యున్నాడు. ఆ ఆత్మ దేవుని మర్మములను పరిశోధించుచున్నాడు. (1 కొరింథి 2 : 10)

## ఒక వ్యక్తికిగల గుణగణములు పరిశుద్ధాత్మకు గలవు

1. ప్రార్థన యందు సహాయము చేయును (రోమా 8 : 26)
2. విజ్ఞాపన చేయును. 3. మనస్సు ఎరుగును.
4. దేవుని సంగతులు తెలిసినవాడు. 1 కొరింథి 2 : 11-13.
5. నేర్పించువాడు 6. శక్తినిచ్చువాడు. రోమా 15 : 13

7. ఉపకారము చేయువాడు. నెహెమ్యా 9 : 20
8. దుఃఖ పడువాడు. ఎఫెసీ 4 : 30
9. దుఃఖింప చేయబడెను. యెషయా 63 : 10

## పరిశుద్ధాత్మకు దైవత్వము యొక్క సహజ లక్షణములు గలవు.

దేవుడు నిత్యుడు, సర్వశక్తి గలవాడు. అలాగునసే పరిశుద్ధాత్మ కూడ నిత్యుడు, సర్వశక్తి గలవాడు. నిత్యుడగు ఆత్మ (హెబ్రీ 9 : 14). దేవుని మర్మములను పరిశోధించగల సర్వశక్తి గలవాడు (1 కొరి 2 : 10-11; మీకా 3 : 8). నీ ఆత్మ యొద్దనుండి నే నెక్కడికి పోవుదును? ఆయన సర్వాంతర్యామి (కీర్తన 139 : 7). క్రొత్త జన్మయందు పరిశుద్ధాత్ముడు (యోహా 3 : 5). అద్భుతములు చేయుటకు పరిశుద్ధాత్ముడు మూలకారకుడు (మత్త 12 : 28).

పైన చెప్పబడిన కార్యములను బట్టి పరిశుద్ధాత్మ వ్యక్తి యని గుర్తించితిమి. ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము వరకు దేవుడు, క్రీస్తు పరిశుద్ధాత్మ అను ఈ దేవత్వము యొక్క పనులు వారి సంకల్ప విధానము వారి మాటలు వారి ఆశీర్వాదములు, సమాధాన కార్యక్రమములు వారి మహిమను మనము చూడగలము. పరిశుద్ధాత్మ ఒక వస్తువుగా గాక ఒక మహిమకరమైన దైవవ్యక్తిగా మనకు అర్థమగును.

## పాతనిబంధనయందు పరిశుద్ధాత్మ

పాతనిబంధన యందు పరిశుద్ధాత్మకు వేరువేరు నామములు (పేర్లు) గలవు. కొన్ని సమయాలలో పరిశుద్ధాత్మ దేవుని ఆత్మ యనియు, యెహోవా ఆత్మ యనియు, ప్రభువు ఆత్మ యనియు పరిశుద్ధాత్మ అనియు పిలువబడెను. పాతనిబంధనయందు 88 వేర్వేరు లేఖ

నములయందు పరిశుద్ధాత్మనుచూర్చి మనము చదువగలము. ఆయ నకు 18 రకముల పేర్లు ఉపయోగించబడెను.

పాతనిబంధనయందు దేవునికి పరిశుద్ధాత్మకు మధ్య ఒకేరకమైన ముంగుర్తులు కన్పించుచున్నవి (కీర్తనలు 139:7). నీ ఆత్మ యొద్దనుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? ఈ లేఖనములో పరిశుద్ధాత్మ దేవునివలె సర్వాంతర్యామి అని అర్థ మిచ్చుచుండెను. వారు తిరుగుబాటు చేసి ఆయన పరిశుద్ధాత్మను దుఃఖింపజేయగా ఆయన వారికి విరోధి ఆయెను (యెష 63:10). దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెను (ఆదికాండము 1:2). అపుడు యెహోవా ఆత్మ నరులతో ఎల్లప్పుడు వాదించదు (ఆది 6 : 3). నీ సన్నిధిలో నుండి నన్ను త్రోసివేయకుము నీ పరిశుద్ధాత్మను నా యొద్దనుండి తీసివేయకుము (కీర్త 51 : 11). వారికి బోధించుటకు నీ ఉపకారాత్మను దయచేసితివి (నెహెమ్యా 9:20). ఈ లేఖనములు దేవుని విశేషమైన ఉద్దేశమును సాధించుటలో మంచి దృక్పథము కలిగిన కార్యకారియగు పరిశుద్ధాత్మ దేవుడని ఋజువుచేయుచుండెను.

## మానవునియందు దేవుని ఆత్మ

దేవుడు నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవ వాయువును ఊదగ నరుడు జీవాత్మ ఆయెను (ఆది 2:7). అందువలన పరిశుద్ధాత్మ ప్రత్యక్షత వలన మానవుని శరీరక జీవితము స్థిరపర్చ బడెను. నా ఊపిరి యింకను నాలో పూర్ణముగా ఉండుటను బట్టియు దేవుని ఆత్మ నా నాసికా రంధ్రములలో ఉండుటను బట్టియు దేవుని ఆత్మ నన్ను సృజించెను (యోబు 27:3; 33:4). సర్వశక్తునియొక్క స్వాస్థ్యము మానవుని శరీరము ఆత్మ మనస్సు దేవుని ఆత్మయొక్క పరిచర్య ఋజువులై యున్నవని పాతనిబంధన లేఖకులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడి వ్రాసిరి.

అయితే పరిశుద్ధాత్మ పాతనిబంధన కాలమందు మనిషియొక్క శక్తి సామర్థ్యములను బట్టి యెహోవా పనిని జరిగించెను. యెహోవా దేవునియొక్క పనిని జరిగించు శక్తి సామర్థ్యము గల మనుష్యులను పరిశుద్ధాత్మ నడిపించినట్లు పాతనిబంధనయందు కొన్ని లేఖనములు పరిశీలించెదము: విచిత్రమైన పనులు కల్పించుటకును బంగారుతోను వెండితోను, ఇత్తడితోను పని చేయుటకు పొదుగుటకై రత్నములను సానబెట్టుటకును కర్రను కోసి చెక్కుటకును జ్ఞాన విద్యా వివేకములను సమస్తమైన పనుల నేర్పును కలుగునట్లు వానిని దేవుని ఆత్మ పూర్ణునిగా చేసెను. బెసలేలునకు శక్తి, జ్ఞానము అనుగ్రహించెను (నిర్గమ 31:3-5). దేవుడైన యెహోవా ఇశ్రాయేలీయులకు ఓత్నీయేలున్న వారికి రక్షకునిగా నియమించెను: కూషన్రిషాతాయిము యొక్క బానిసత్వమునుండి ఇశ్రాయేలీయులను విడిపించుటకు ఓత్నీయేలుపై యెహోవా ఆత్మ వచ్చినందున కూషన్రిషాతాయిములను జయించెను (న్యాయా 3 : 10). యెహోవా ఆత్మ గిద్యోనును ఆవేశించెను (న్యాయా 6:34). యెహోవా ఆత్మ యెఫ్తా మీదికి వచ్చెను. గనుక అతడు యుద్ధమును జయించెను (న్యాయా 11:29). యెహోవా ఆత్మ సమ్సోనును ప్రేరేపింపగా అతని చేతిలో ఏమియు లేకపోయినను కొదమసింహమును మేకపిల్లను చీల్చినట్లుగా అతడు దానిని చీల్చెను (న్యాయా 14:6).

దేవుడు తన సంకల్పములను భూలోకమందున్న ప్రజలకు తెలియజేయుటకు ప్రవక్తలను ఏర్పరచుకొనెను. ఈ ప్రవక్తలకు దేవుడు తన పరిశుద్ధాత్మను అనుగ్రహించి అట్టి శక్తివలన దైవ సమాచారములను ప్రజలకు ఎరిగించెను.

ఆయన నాతో మాట్లాడినపుడు ఆత్మ నాలోనికివచ్చి నన్ను నిలువబెట్టెను. అప్పుడు నాతో మాట్లాడినవాని స్వరము వింటిని

(యెహెజ్కేలు 2:2). "పిమ్మట ఆత్మ నన్ను ఎత్తి యెహోవా మందిరపు తూర్పు గుమ్మము నొద్దకు నన్ను చేర్చి పంపగా (యెహెజ్కేలు 11:1). యెహోవా ఆత్మ నా మీదికి వచ్చి ఆజ్ఞ యిచ్చిన దేమనగా (యెహె 11:5). నీవు అనేక సంవత్సరములు వారిని ఓర్చిన ప్రవక్తల ద్వారా నీ ఆత్మ చేత వారిమీద సాక్ష్యము పలికితివిగాని వారు వినక పోయిరి (నెహెమ్యా 9:30).

రాజైన దావీదుకూడ పరిశుద్ధాత్మ వలన మాట్లాడెను (II సమూయేలు 23:2).

పాతనిబంధనయందు గల మాటలు పరిశుద్ధాత్మ మాటలని క్రొత్తనిబంధన ఘనముగా చెప్పుచున్నది. ఒకడు తన ఊహానుబట్టి చెప్పుటవలన లేఖనములలో ఏ ప్రవచనము పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎపుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి (II పేతురు 1 : 20-21).

మానవునికి దేవునిని బయలుపర్చుటకు పరిశుద్ధాత్మ ప్రత్యక్షత అవసరమాయెనని పాతనిబంధన లేఖనములు స్పష్టముగాను, తరచుగాను నొక్కివక్కాణించుచున్నవి. అంత్యదినములలో మనుష్యులందరకు దేవుడు తన పరిశుద్ధాత్మను అనుగ్రహించునని పాతనిబంధనయందు గల ప్రవక్తలు సాక్ష్యము పలికిరి (యెహెజ్కేలు 36 : 27; 37:14; 39:29; యెషయా 44:3; యోవేలు 2:28; జెకర్యా 12:10).

(ఇంకా ఉంది) —M. ఆల్‌ఫ్రెడ్, రామచంద్రపురం.

---

సత్యవాక్కు పాఠకులకు విజ్ఞప్తి : మీకు సత్యవాక్కు పత్రిక ఒక కాపీ కంటె ఎక్కువగా అందుచున్నయెడల వెంటనే మాకు తెలియజేయండి. మీ సత్యవాక్కు నంబరుకూడ తెలియజేయండి.

# సంక్షిప్త వార్తలు

1994 మార్చి 30, 31, ఏప్రిల్ 1వ తేదీలలో కర్నాటకలోని K. G. F. పట్టణములో గొప్ప సువార్త కూటములు జరిగెను. Bro. మైక్ గారు (పొల్లాచి, తమిళనాడు), Bro. Ch. జేకబ్ గారు (బెంగుళూరు), జాషువా గూటంగారు వాక్య పరిచర్య చేసిరి. ప్రతి కూటమునకు వందలాది ప్రజలు హాజరైరి. రాత్రివేళ కూటమునకు ముందు, అనంతరము కూడ క్రీస్తు జీవిత చరిత్ర చలన చిత్రము ప్రదర్శింపబడెను. K. G. F. క్రీస్తు సంఘస్థులు నిర్విరామ కృషిచేసి ఈ కూటములను జయప్రదము చేసిరి, సువార్త కూటములను గూర్చి వారు ఆ పట్టణంలో భారీయెత్తున పబ్లిసిటి చేసిరి. Bro. R. యాకోబు గారు BEML లో ఉద్యోగము చేస్తు ఈ పట్టణంలో క్రీస్తు కొరకు మంచిపని చేయుచున్నారు.

ఏప్రియల్ 3వ తేదీ ఆదివారం కర్నాటకలోని బళ్లారి జిల్లా హాస్పేటలో జరిగిన సువార్త కూటములో జాషువా గూటంగారు ఉపన్యసించిరి; ఉదయం స్థానిక సంఘస్థులు నిర్మించిన ఆలయమునకు ప్రారంభోత్సవము చేయగా. దీనిలో ఆరాధన జరిగించబడెను. సాయం కాలము 4 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోదరులు P. భాస్కర్ గారు హాస్పేటలోను పరిసర ప్రాంతములలోను మంచిసేవ చేయుచున్నారు.

ఏప్రియల్ 14వ తేదీనాడు జాషువాగారు ఆచంట, ఆలమూరు, కొయ్యేటిపాడు, పంజిత విల్లూరు గ్రామములలో యున్న సంఘము లను దర్శించి వాక్య పరిచర్య చేసి - సోదరులను ప్రోత్సహించిరి. ఆచంటలో P. సామ్యూల్ గారు వారి కుమారుడు సామ్యేలురాజు గారు, Bro. K. ప్రసాద్ గారు తదితర్లు మంచిపని చేయుచున్నారు. పశ్చిమ గోదావరిజిల్లా ఆలమూరులో Bro. D. చిట్టెయ్యగారు,

కొయ్యేటిపాడులో Bro. P. స్తెఫనుగారు, పండిత విల్లూరులో Bro. M.ఇశ్రాయేలుగారు క్రీస్తుకొరకు మంచిపని చేయుచున్నారు. పండిత విల్లూరులో జరిగిన రాత్రివేళ కూటమునకు వందలాది ప్రజలు హాజరయ్యారు. సోదరులు M. జోసఫ్, P. సామ్యూలు K. గంగాధర్, K. ప్రసాద్‌గార్లు వాక్యపరిచర్య జరిగించిరి. సువార్త కూటము రాత్రి 1:30 గంటలకు ముగిసెను. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

ఏప్రిల్ నెల సువార్తికుల సదస్సు 22వ తేదీన పల్లంకుర్రిలో జరిగెను. "నేడు అద్భుత స్వస్థతలు జరిగించుచున్నామని చెప్పువారు క్రీస్తుకు విరోధులా? అనుచరులా?" అను అంశము పలు ప్రాంతముల నుండి వచ్చిన సువార్తికుల సమక్షంలో చర్చింపబడెను.

సోదరులు M ఆల్‌ఫ్రెడ్, పాల్ గూటం, వి. చిన్నయ్య, బి. స్టీవెన్‌సన్, జాషువాగార్లు చర్చలో పాల్గొనిరి. నేటి ప్రపంచములో కొందరు రక్షణార్థమైన జ్ఞానము కలిగించు పరిశుద్ధ లేఖనములను విడిచి, అద్భుత స్వస్థతలపై ఆధారపడుచున్నారు. దేవుడు ఒకానొకప్పుడు అద్భుతములు చేసెను, చేయించెను. అయితే వాటి ప్రయోజనం ఇక లేకపోయింది. యేసుక్రీస్తు చేసిన అద్భుతములన్నీ ఆయన దేవుని కుమారుడని నిరూపించుటకు జరిగించెను (యోహాను 20 : 30-31). అపొస్తలులు చేసిన అద్భుతములు, సూచక క్రియలు, వాక్యమును స్థిరపరచుటకు జరిగించబడెను (మార్కు 16:20). ఇప్పుడు స్థిరపరచబడి, గ్రంథస్థము చేయబడిన వాక్యము మనకున్నది. నేడు విశ్వాసము దేవుని వాక్యము వినుటద్వారా గాని, చదువుటద్వారా గాని, లేదా ఈ రెండింటిద్వారా గాని కలుగును. పరిశుద్ధాత్ముడు క్రొత్త నిబంధన గ్రంథమును సంపూర్తిగ లిఖింపజేసి యిచ్చిన వెంటనే అద్భుత వరములు నిలిచిపోయెను. గనుక నేడు అద్భుత స్వస్థతలు చేయువారు కేవలం నిరుత్తరులై యున్నారు. అట్టి వారిని ప్రభువు ఎన్నడును ఎరుగననును (మత్త 7 : 21-23). అబద్ధపు క్రీస్తులును, అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైతే ఏర్పరచబడినవారిని

సయితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలను కనబరచెదరు" (మత్తయి 24:24).

ఈ సదస్సు జరిగిననాడు పల్లంకుర్రులో నిర్మించబడిన ఆలయ ప్రవేశము జాషువా గూటంగారి ఆధ్వర్యమున జరిగించబడెను. పల్లంకుర్రులోను తదితర ప్రాంతములలోను బాల మోహనుగారు మంచి పని చేయుచున్నారు.

సాయంత్రం 7 గంటలకు చెయ్యేరులో నిర్మించబడిన ఆలయమును రిబ్బను కత్తిరించుటద్వారా జాషువాగారు ప్రవేశము గావించిరి. తదనంతరము జరిగిన సభలో అనేకులు పాల్గొనిరి. రాత్రి కూటమునకు విచ్చేసిన వారందరికి చెయ్యేరు, అనాతవరం సంఘములు చక్కటి భోజన విందు నేర్పాటు చేసిరి. చెయ్యేరు ప్రాంతములో ఇ. కె.వి. ప్రసాదరావుగారు నిర్విరామ కృషి చేయుచు దేవునినుండి దీవెనలు నందుకొనుచున్నారు. ★

---

Regd. No. H/KD—45/KD H.O.

*From*
**SATYA WAKKU**
**P.O. Box 80**
**KAKINADA 533 001**

**No.**

**To**

NEW DELHI—110049

COLONY